క్లుప్తంగా

అందరి సహకారంతో కాలుష్య నియంత్రణ



సైకిల్‌పై కార్యాలయానికి చేరుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య నిర్మూలనకు నగర పౌరులందరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. నగర కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. నగరంలో శబ్ద, వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా, కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

180వ రోజుకు రూ.10 భోజనం



పేషెంట్ సహాయకులకు భోజనం అందజేస్తున్న మక్సూద్ అహ్మద్

దాబాగార్డెన్స్: రౌండ్ టేబుల్, స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ప్రభుత్వ విక్టోరియా(ఘోషా) ఆస్పత్రిలో రూ.10కే భోజనం అందజేత సోమవారం నాటికి 180వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా భోజనంతోపాటు పోషకాలు కలిగిన హార్లిక్స్ పాలును పేషెంట్ సహాయకులకు అందించారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధి మక్సూద్ అహ్మద్, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విష్ణు వైభవం హరికథ



హరికథకురాలు భారతిని సత్కరిస్తున్న ఈవో బుద్ధ మహలక్ష్మి నగేష్, ఆలయ సిబ్బంది

దాబాగార్డెన్స్: దేవదాయ ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఇసుకకొండ(బాబాజీకొండ)పై వెలసిన రమ సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించిన విష్ణు వైభవం హరికథ భక్తులను ఆకట్టుకుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు సాగిన కార్యక్రమంలో ఏలూరుకు చెందిన హరి కథకురాలు సప్ప భారతి విష్ణు వైభవంపై భక్తులకు వినిపించారు. అనంతరం ఆమెను సత్కరించారు. వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీణ, గాత్ర విద్వాంసుడు తోలేటి బుచ్చిబాబుచే వీణ నాదం, గాత్ర భక్తి సంగీత విభావరి నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ మహలక్ష్మి నగేష్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

15 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- అమ్మవార్ల ఆలయాల్లో సన్నాహాలు
- కనకమహాలక్ష్మి దేవస్థానంలో అష్టలక్ష్మి అవతారాల్లో దర్శనం
- కన్యకా పరమేశ్వరి, దుర్గాలమ్మ ఆలయాల్లో విశేష అలంకరణలు



ధనలక్ష్మిగా దర్శనమిచ్చిన కనకమహాలక్ష్మి అమ్మవారికి చామంతులతో అర్చన (ఫైల్)

దాబాగార్డెన్స్: శరన్నవరాత్రి మహోత్సవాలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో కమిటీలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. కనకమహాలక్ష్మి దేవస్థానంలో, దుర్గాలమ్మ ఆలయంలో, కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లు తొమ్మిది రోజులూ విశేష అలంకరణల్లో దర్శనమీయనున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. భవానీ భక్తులు ఇప్పటికే మాలలు ధరించారు.

ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మికి విశేష పూజలు

బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 23 వరకు నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారిని అష్టలక్ష్మీ అవతారాల్లో అలంకరించి, విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 15వ తేదీన, ఉత్సవాల మొదటి రోజు అమ్మవారిని ఆదిలక్ష్మిగా అలంకరించి, లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. 16న ధనలక్ష్మి అవతారంలో లక్ష చామంతులతో పూజ, 17న ధాన్యలక్ష్మి అవతారంలో లడ్డూల పూజ, 18న ధైర్యలక్ష్మి అవతారంలో లక్ష తులసి పూజ జరిపించనున్నారు. 19న సంతానలక్ష్మి అవతారంలో అలంకరించి, కలువపూలతో పూజ చేయనున్నారు. 20న విద్యాలక్ష్మిగా అలంకరించి, శ్రీ పుష్పయాగం, 21న గజలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చే అమ్మవారికి లక్ష గాజులతో పూజ నిర్వహించనున్నారు. 22న విజయలక్ష్మిగా దర్శనమిచ్చే అమ్మవారికి శాకాంబరిగా పండ్లు, పుష్పాలతో అలంకరించనున్నారు. 23న స్వర్ణలక్ష్మి అలంకరణలో, 108 బంగారు పుష్పాలతో స్వర్ణపుష్పార్చన జరిపించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో కమిటీ నిమగ్నమైంది.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించనున్నారు. 15న కన్యకాపరమేశ్వరిని బాల త్రిపుర సుందరిదేవిగా, 16న అన్నపూర్ణదేవిగా, 17న గాయత్రీదేవిగా, 18న రాజరాజేశ్వరిదేవిగా, 19న ధనలక్ష్మిగా అలంకరించనున్నారు. 20న సరస్వతిదేవిగా, 21న శాకాంబరిగా, 22న మహాలక్ష్మిగా, 23న కాళీమాతగా, 24న దుర్గాదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మూలవిరాట్‌కు రోజూ తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు, సామూహిక పూజలు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో..



దుర్గాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజులు ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమీయనున్నారు. 15న స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా, 16న బాలత్రిపుర సుందరీదేవిగా, 17న గాయత్రీదేవిగా, 18న అన్నపూర్ణాదేవిగా, 19న లలితా త్రిపుర సుందరీదేవిగా, 20న మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని మహాసరస్వతి దేవిగా అలంకరించనున్నారు. 21న మహాలక్ష్మీ దేవిగా, 22న దుర్గాదేవిగా, 23న మహిషాసుర మర్దనిగా, విజయదశమి రోజున రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ తొమ్మిది రోజులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల గోత్ర, నామాలతో పూజ చేయించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

విజయవాడ సమావేశానికి తరలిన నేతలు



వందేభారత్ ట్రైన్‌లో విజయవాడకు పయనమైన ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్లు, నాయకులు

దాబాగార్డెన్స్: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ సీపీ ప్రతినిధులు విస్తృత స్థాయి సమావేశానికి దక్షిణ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో పాటు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, బిపిన్‌కుమార్‌జైన్, ఉరుకుటి నారాయణరావు, తోట పద్మావతి, విల్లూరి భాస్కరరావు, మాసిపోగు మేరీ జోన్స్, చెన్నా జానకీరామ్, కోడిగుడ్ల పూర్ణిమ, క్లస్టర్ ప్రెసిడెంట్లు దొడ్డి బాపూ ఆనంద్, కర్రి నీలకంఠం, కొల్లి సింహాచలం, పీతల వాసు, క్లస్టర్ ఇన్‌చార్జిలు దొడ్డి రామానంద్, కోడిగుడ్ల శ్రీధర్, మాసిపోగు రాజు, కోన శంకర్, నగర ప్రధాన కార్యదర్శి రమణా రెడ్డి తదితరులు సోమవారం ఉదయం వందేభారత్ రైలులో విజయవాడకు పయనమయ్యారు.

వైఎస్సార్‌సీపీ సమావేశంలో..



175/175 ప్లకార్డుతో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశంలో 41వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, పార్టీ సీనియర్ నాయకుడు, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ పాల్గొన్నారు. 175/175 ప్లకార్డు ప్రదర్శించి 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామంటూ అందరినీ ఆకర్షించారు.

వన్‌టౌన్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు, సిబ్బంది

జగదాంబ: వన్ టౌన్ రహదారిని ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలను సోమవారం ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు, సిబ్బంది తొలగించారు. జగదాంబ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొందరు వ్యాపారులు రహదారి, కాలువ నిర్మాణ పనులు పూర్తికాకముందే రోడ్డు పక్కన స్థలాలను ఆక్రమించుకుని వ్యాపార లావాదేవీలు సాగించేందుకు ప్రయత్నించారు. దీనిపై స్పందించిన ట్రాఫిక్ పోలీసులు చిరు, తోపుడు బండ్ల వ్యాపారులను అక్కడ నుంచి తొలగించి రహదారి పనులకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా ఎస్‌ఐ భాస్కరరావు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రహదారిని విస్తరిస్తున్నారని, ఇందుకు సహకరించకుండా ఆక్రమణలకు పాల్పడటం తగదన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలిగే పనులు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జోరుగా ఆరోగ్య సురక్ష సర్వే



ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం టోకెన్ అందిస్తున్న రంథి గోపి తదితరులు



ప్రసాద్ గార్డెన్స్‌లో సర్వే చేస్తున్న ఏఎన్‌ఎంలు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జోరుగా సాగుతోంది. రెండు రోజు సోమవారం గాజుల వీధి, ప్రసాద్ గార్డెన్స్ ప్రాంతాల్లో సర్వే పూర్తి చేశారు. ప్రసాద్ గార్డెన్స్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.సందేష్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, సెక్రటరీలు, కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు నమోదు చేసుకుంటున్నారు. బీపీ సుగర్, హెచ్‌బీ మొదలగు టెస్టులు చేసి టోకెన్లు అందిస్తున్నారు. వార్డులో ఈ నెల 28న నిర్వహించనున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి తరలిరావాలని వార్డు ప్రజలకు సూచిస్తున్నారు.

33వ వార్డులో..

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. సోమవారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంధి గోపికృష్ణ, పార్టీ నాయకులు, కన్వీనర్లు, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది వార్డులోని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. బీపీ, సుగర్ వంటి పరీక్షలు నిర్వహించారు. బంగారమ్మమెట్ట సచివాలయం పరిధి ఎస్సీ కాలనీలో జరిగిన ఇంటింటి సర్వేలో టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, భీశెట్టి రాజు, ఏఎన్ఎం లక్ష్మి, ఆశ వర్కర్ అనురాధ, సూపర్‌వైజర్ కె.రమేష్, వలంటీర్లు లలిత, వైద్య విద్యార్థులు వైద్య పరీక్షలు నిర్వహించి టోకెన్లు అందించారు. త్వరలో జరగనున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కుటుంబంలోని ప్రతి ఒక్కరూ పాల్గొని పరీక్షలు చేయించుకోవాలని వారు సూచించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలి.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో నవంబరు 2, 3, 4 తేదీల్లో ద్రవ స్ఫటికాలపై నిర్వహించే మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు 250 మందికిపైగా హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. ఈ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య కె.బసవయ్య, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ నాంచార రావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవడం తప్పనిసరి



శిక్షణకు హాజరైన ఎన్‌టీపీసీ అధికారులతో ఐఐఎం అధికారులు

ఏయూ క్యాంపస్: సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎన్‌టీపీసీ సింహాద్రి హెచ్‌వోపీ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌లో ఎన్‌టీపీసీ అధికారులకు నిర్వహిస్తున్న లీడర్‌షిప్ కోర్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో పరిణితి సంస్థ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు వ్యక్తి ఉన్నతికి ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఐఐఎం విశాఖపట్నం ఇటువంటి కార్యక్రమాలను విస్తృతగా నిర్వహించాలన్నారు. నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించుకునే విధంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎన్‌టీపీసీ హెచ్‌ఆర్ విభాగాధిపతి రుమా డి.శర్మ మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేక కోర్సులు సంస్థలో పనిచేసే ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఐఐఎం పరిపాలన విభాగం డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ మాట్లాడుతూ భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దడానికి, సంస్థ ప్రగతికి దోహదపడే వ్యక్తులుగా తమ సిబ్బందిని మలచడానికి ఇటువంటి ప్రత్యేక కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్, ప్రోగ్రాం డైరెక్టర్ ఆచార్య విశాల్ సింఘ్ పట్యాల్, తదిరతులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలి



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ సభ్యులు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యా రంగంలో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఏబీవీపీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. మెగా డీస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు, యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నినదించారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జునకు ఏబీవీపీ సభ్యులు వినతిపత్రం అందజేశారు.

ప్లాస్టిక్ నిషేధంతోనే పర్యావరణ పరిరక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న రెక్టార్ ఆచార్య సమత, పరిశోధకులు, అధికారులు

ఏయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించడం తప్పనిసరని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా సముద్ర జీవులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. యూరోపియన్ కమిషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జీవీఎంసీ అధికారులు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ

మర్రిపాలెం: ఇటీవల కాలంలో జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు ప్రజలందరూ సహకరించాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎస్.సాయి కోరారు. ఐటీఐ జంక్షన్ తుమ్మల పాలెంలోని చైతన్యం, కల్చరల్ రీడింగ్ రూమ్ వద్ద సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైన్ స్నాచింగ్, బైకు చోరీలు, సైబర్‌నేరాలు ఎలా జరుగుతాయో వివరించారు. వాటిని గమనించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాలు నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా నేరాలకు పాల్పడుతున్న వారిని త్వరితగతిన గుర్తించి నియంత్రించవచ్చని చెప్పారు. ఎస్‌ఐ షేక్ సమీర్, క్రైం ఎస్‌ఐ సునీల్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలపై అవగాహన

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అబిద్ నగర్‌లో సోమవారం సీసీ కెమెరాలపై సీఐ ఎస్.విజయకుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దాని వల్ల దొంగలను గుర్తించడం వీలువుతుందని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. నగదు, విలువైన ఆభరణాలను బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు.

అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతలకు ప్రసాదం అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం అనకాపల్లికి చెందిన మళ్ల రామకోటేశ్వరరావు లక్షా 116 రూపాయిల విరాళం ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు పీఆర్వో నాయుడు అన్నప్రసాద బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు.

నగరవాసి విరాళం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం నగరానికి చెందిన బి.అశ్విని, సురేందర్‌రెడ్డి దంపతులు రూ. లక్ష విరాళం ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు.

'బీజేపీది కపట నాటకం'

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై బీజేపీది కపట నాటకమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ విమర్శించారు. మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు సోమవారానికి 921వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం మూడు సంవత్సరాలుగా ఉద్యమం జరుగుతున్నా మోదీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, ప్రజల ఆస్తులను బీజేపీ భక్తులైన బడా పారిశ్రామిక వేత్తలు అంబానీ, ఆదానీ, వేదాంత తదితరులకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వంపై ప్రజలకు రోజురోజుకూ అసహనం పెరిగిపోతోందన్నారు. నిరంకుశ పద్ధతుల ద్వారా కార్మిక, ప్రజా ఉద్యమాలు అణచివేస్తే ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలను ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ఎం.మన్మథరావు, కోట సత్తిబాబు, కె.సత్యనారాయణ, లింగాల వెంకటేష్, సింహాచలం పాల్గొన్నారు.

సకాలంలో వినతుల పరిష్కారం



అర్జీదారు సమస్య వింటున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ప్రజా సమస్యలపై అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని ఆయన స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 03, యూసీడీకి 01, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. స్పందనలో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి అపరంజిత, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దన్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

కేవీలో తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్



మాట్లాడుతున్న సీనియర్ డీపీవో రంజన్ మహంతి



క్యాంప్‌లో పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం హైవేలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేర్‌లో సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ కోసం తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్‌ను ముఖ్య అతిథి ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నేటితరం పిల్లలు కేవలం విద్యకే పరిమితం కాకుండా విద్యేతర సంబంధిత ప్రత్యేక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని సూచించారు. దీని ద్వారా వివిధ రంగాల్లో ప్రావీణ్యం సంపాదించవచ్చన్నారు. కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. ఈ క్యాంప్‌లో 11 స్కూళ్ల నుంచి సుమారు 200 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు శిబిరం కొనసాగుతుంది. విద్యార్థులు ఇంతవరకు నేర్చుకున్నవి పరీక్షించుకుంటూ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం, నాట్స్, హిచెస్, ప్రథమ చికిత్స, క్రమశిక్షణ, షేరింగ్ అండ్ కేరింగ్, డూ టు ఏ గుడ్ టర్న్ వంటి విషయాలు నేర్చుకుంటారు. ఈ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని శైలజ, సిబ్బంది ప్రభాకర్, ఎం.రేఖ, వై.విజయలక్ష్మి, జగన్‌మోహన్, మణిబాబు తదితరులు సహకరిస్తున్నారు.